అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు

- నిరసన తెలిపే రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కును కాలరాస్తున్న ప్రభుత్వం : వామపక్షాలు ధ్వజం
- విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం చేయటాన్ని అందరూ వ్యతిరేకించాలంటూ పిలుపు

ఉక్కు ప్రైవేట్ పరం చేసే ఆలోచన విరమించే వరకూ పోరు
- వామపక్ష నాయకులు బలగ శ్రీరామ్మూర్తి, మోహనరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ప్రజల

హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాలను అనచి వేయాలని ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం లతో ఉద్యమాలు ఆపలేరని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన రాస్తా రోకో పిలుపుమేరకు సిద్ధం అయిన వామపక్ష, కార్మిక సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, రైతు సంఘం నాయకులు మోహన రావు, సీఐటీయూ నాయకులు కమ్మి నేని సూరయ్య, నక్క సూరిబాబు, వీధి విక్రయ దారుల సంఘం నాయకులు పట్టా ప్రసాద్‌లను బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మధ్యాహ్నం విడిచి పెట్టారు. ఈ సందర్భంగా బలగ శ్రీరామ్మూర్తి, మోహనరావులు మాట్లాడుతూ మోడీ అధికారం చేపట్టిన తరువాత దేశ సంపద కార్పొరేట్ శక్తులకు కట్ట బెడుతున్నారు అని, అందులో బాగంగా రాష్ట్ర కీర్తి కిరీటం అయిన విశాఖ ఉక్కును నష్టాల సాకుతో ప్రైవేట్‌పరంకి పూనుకుంటున్నారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వ పెద్దలు వెనకడుగు వేయక పోవటం దారుణమన్నారు. ఎందరో ప్రాణత్యాగం, మరెందరో తమ విలువైన భూములను ఇచ్చి సాధించి కున్న విశాఖ ఉక్కు నేడు పాలకుల నిర్లక్ష్యానికి గురైంది అని, పాలకులు స్టీల్‌కు గనులు కేటాయించిన పాపాన పోకపోవడమే నష్టాలకు కారణమని, అది తెలిసి కూడా స్వంత గనులు కేటాయించకుండా నష్టాల పేరుతో కారుచౌకగా కార్పొరేట్‌లకు కట్ట బెట్టెందుకు ఇలాంటి దుర్మార్గ ఆలోచనకు తెర తీసిందన్నారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేలా బీజేపీ నేతలు పన్నాగం పన్నుతున్నారు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేయటాన్ని రాష్ట్ర ప్రజలందరు వ్యతిరేకిస్తున్న పాలకులు ప్రజల మనోభావాలను అర్థం చేసుకోకుండా వారి స్వలాభం కోసమే ఇలాంటి దుర్మార్గ చర్యలు తీసుకోవటం దారుణం అన్నారు. విశాఖ ఉక్కు విషయంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గేవరకూ మాపోరాటం ఆగదన్నారు. రాష్ట్రంలోని ఇలాంటి పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం దారుణమన్నారు. వారు పోరాడటం లేదు సరికదా పోరాటం చేస్తున్న వారిని కూడా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేసి ఉద్యమాన్ని అనగ దొక్కాలని చూడటం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కు కలిసి వచ్చి మన రాష్ట్ర హక్కును సాధించు కుందాం అని, లేదా చరిత్ర హీనులుగా మిగిలిపోతారు అని వైసీపీ నాయకులకు సూచించారు. వామపక్ష, కార్మిక సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు లు, గృహ నిర్బంధం చేయటం రాష్ట్ర ప్రజలు ఖండిస్తున్నారని, వారే పాలకులకు బుద్ధి చెబుతారన్నారు. ఉద్యమాలను ఎవరూ ఆపలేరని, ఎంత తొక్కి పెట్టాలని చూస్తే మరింత ఎత్తు ఉద్యమాలు ఉవ్వెత్తున పుడతాయని హెచ్చరించారు.

-విశాఖ ఉక్కును కాపాడుకుంటాం...

గోవిందరావు : కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేసే దిశగా తీసుకుంటున్న చర్యలను తిప్పికొట్టి విశాఖ ఉక్కును రక్షించుకుంటా మని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ టౌన్ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావులు అన్నారు. రాస్తారోకో సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులు ఉదయమే నాయకుల ఇళ్లకు వెళ్లి వీరితోపాటు సీపీఎం టి. తిరుపతిరావు, సీఐటీయు నాయకులు తేజేశ్వరరావు లను అదుపులోకి తీసుకొని రెండో

పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

పోలీసుల అదుపులో సీపీఐ నాయకులు...

శ్రీకాకుళం నగర కార్యదర్శి డోల శంకరావు తో పాటు ఏఐటీయుసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావులను బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గృహ నిర్బంధంలో ఉంచారు. అలాగే ఇచ్ఛాపురం నియోజకవర్గ

సీపీఐ ఇన్‌చార్జి ఎస్. నారాయణస్వామి ఇంటికి పోలీసులు బుధవారం చేరుకొని కంచిలి పోలీసు స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తులపై విడుదల చేశారు. వీరితోపాటు సీఐటీయు నాయకులు పిట్ట కృష్ణను కూడా పోలీసులు నిర్బంధించారు. సీపీఐ సీనియర్ నాయకులు లక్కోజి శ్రీనివాసరావును సారవకోట పోలీసులు గృహ నిర్బంధం చేశారు.

టెక్కలిలో : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వమే నడపాలని కోరుతూ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల పిలుపుమేరకు మే 3వ తేదీన నిరసన కార్యక్రమం చేపట్టకుండా అడ్డుకొని అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఏఐటీయుసి, సిఐటియు నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం వేకువ జామున కార్మిక సంఘాలు నాయకుల ఇళ్ళకు పోలీసులు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీ చేశారు. అక్కడతో ఆగక ఉదయం 7:30 గంటల వరకూ గృహ నిర్బందాల్లో ఉంచి, అనంతరం ప్రభుత్వ ఆదేశాలు, పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌కు అక్రమంగా అరెస్టులు చేసి తరలించిన వారిలో ఏ.ఐ.టి.యు.సి. జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు

పాల పోలారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మొజ్జాడ యుగంధర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, విద్యార్థి యువజన సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుదేవ్ బెహరా, సిఐటియు జిల్లా నాయకులు నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొల్లి ఎల్లయ్యలు ఉన్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులపై విడిచిపెట్టారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులకు నిరసనగా పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖ రావు, ఏఐటియుసి నాయకులు అనపాన షణ్ముఖ రావులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపే హక్కు ప్రతీ పౌరునికి ప్రాథమిక హక్కుని, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కును కూడా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ విధానాలు మార్చుకోకపోతే కార్మిక వర్గం తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వమే నడపాలని, ప్రైవేటీకరణ విధానాన్ని విరమించాలని నినాదాలు చేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయటం దుర్మార్గం
అక్రమ అరెస్టులు ఖండించాలి
- గురుగుబెల్లి రాజేశ్వరరావు, సనపల నర్సింహులు

శ్రీకాకుళంలో : కేంద్రంలో మోడీ అధికారం చేపట్టిన తరువాత దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్ట బెట్టడమే పనిగా పెట్టుకున్న బీజేపీ, ఆంధ్రుల హక్కు అయిన వైజాగ్ స్టీల్‌ను కూడా ప్రైవేట్‌కు కట్టబెట్టేలా చర్యలు తీసుకోవటం దుర్మార్గమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుగుబెల్లి రాజేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సనపల నర్సింహులు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష, కార్మిక

సంఘాలు బుధవారం విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం చెయ్యడాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోకు పిలుపును అడ్డుకునేందుకు పోలీసులు వామపక్ష, కార్మిక సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేయటం దారుణమన్నారు. ఈమేరకు వారు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. మోడీ పాలన బ్రిటీష్ పాలకుల కన్నా ఘోరంగా ఉందని, అనాడు దేశ సంపద తెల్లదొరలు వారి దేశానికి తరలించారని, నేడు బీజేపీ పాలకులు దేశ సంపదను అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం పనిగా పెట్టుకున్నారన్నారు. అప్పులు చేసి ఇతర దేశాలకు పారిపోయిన కార్పొరేట్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వారిని ప్రోత్సహిస్తున్నారని, నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేయటం దారుణ మన్నారు. నరేంద్ర మోడీ పాలనను సాగ నంపక పోతే భవిష్యత్ తరాలకు పెను ప్రమాదం అని ప్రతీ ఒక్కరూ మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల మీద అలుపెరుగని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి తలమానికం అయిన విశాఖ ఉక్కును కాపాడు కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోక పోవటం దారుణం అని, విశాఖ ఉక్కు కాపాడు కోవాలి వామపక్షాలు, కార్మిక సంఘాల చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాల్సింది పోయి పోరాటాలు అడ్డుకోవటం దారుణమన్నారు. మంగళవారం సాయంత్రం నుంచే వామపక్ష నాయకులను గృహనిర్బంధం, అక్రమ అరెస్టులు చేయటాన్ని వారు ఖండించారు. రాష్ట్ర ప్రజలు కూడా ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నారు అని, అక్రమ అరెస్టులు ముందస్తు అదుపులతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం చేసే ఆలోచన విరమించే వరకూ పోరాటం ఆగదని మరింత ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు

మెళియాపుట్టిలో : రాష్ట్రంలో శాంతియుతంగా

ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేస్తుంటే అక్రమ అరెస్టులు చేయటం అప్రజాస్వామికం అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు అన్నారు. బుధవారం రాస్తారోకో కు సిద్ధం అవుతున్న వెంకటరావు ను మేలియపుట్టి పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్బంధం, అక్రమ అరెస్టు లతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు.

మోడి నిరంకుశ పాలనతో రాష్ట్రానికి ముప్పు

పలాసలో : ప్రధాని మోడి నిరంకుశ పాలనతో రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వామపక్ష నాయకులు అన్నారు. బుధవారం విశాఖ ఉక్కు ఉద్యమంలో భాగంగా రాస్తారోకో కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో కాశీబుగ్గ పోలీసులు వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, రైతు సంఘం నాయకులు వంకల మాధవరావు, సిపిఎం నాయకులు ఎన్.గణపతిలు విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని కేంద్ర ప్రభుత్వం గుండుగుత్తాగా అమ్మేస్తుందని, దానిని అపాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్న నాయకులను వైసీపీ ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేయడం సరైనది కాదని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వైసీపీ ప్రభుత్వం సానుకూలంగా ఉందా.. లేదా..? ప్రజలకు తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలపై అధికార ప్రతిపక్ష పార్టీలు ప్రజాసంఘాలతో కలిసి పోరాడాలని, లేకుంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా సారిపల్లి నిరోషా నియామకానికి ఎమ్మెల్యే గ్రీన్‌సిగ్నల్

విశాలాంధ్ర-కొత్తూరు : ఎల్.ఎన్.పేట, హిరమండలాలకు చెందిన హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసి) ఛైర్మన్‌గా బలద గ్రామానికి చెందిన సారిపల్లి నిరోషా నియమాకానికి స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రీన్‌సిగ్నల్ పలికారు. నిరోషా బలద ఎంపిటిసి సారిపల్లి ప్రసాద్‌రావుకు మరదలు, సర్పంచ్ భారతీకి తోటికొడలు అవుతారు. ఇంతకముందు ఈ ఎంఎంసి ఛైర్మన్‌గా కొత్తూరుకు చెందిన గోగుల మాధవి దాదాపు రెండేళ్లపాటు పనిచేశారు. ఎంఎంసి ఛైర్మన్, పాలక మండలిని ప్రభుత్వం అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్స్ మేరకు నియమిస్తుంది. అయితే కొన్ని రాజకీయ కారణాలతో గోగుల మాధవిని మరోమారు సదరు పదవిలో కొనసాగడానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇష్టపడక వైసీపీ మండల కమిటీ అధ్యక్షులుగా ఉన్న సారిపల్లి ప్రసాదరావు కుటుంబానికి చెందిన సారిపల్లి నిరోషాను ఎఎంసి ఛైర్మన్‌గా, నూతన పాలక మండలిని నామినేట్ చెయ్యడానికి తనవంతుగా ఆమోదం తెలుపుతూ ప్రతిపాదనలకు లేఖను రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్‌కు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇచ్చినట్లు తెలిసింది. అయితే అధికారికంగా ఎఎంసి ఛైర్మన్, పాలకమండలి నామినేటెడ్‌కు సంబంధించిన ఉత్తర్వులు వెలువడాల్సి వుంది.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర-పలాస : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలు పని చేస్తున్నాయని బ్రాహ్మణ తర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణ తర్ల, బంటు కొత్తూరు, అమలకుడియా తదితర ప్రాంతాల్లో బుధవారం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులను ప్రభుత్వ సంస్థలలో చేర్పించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాలలో నూతన భవనాలు నిర్మించాడం జరిగిందన్నారు. సౌకర్యవంతమైన తరగతి గదులు, విశాలమైన క్రీడా మైదానం, ఆంగ్ల మాధ్యమం విద్యతోపాటు ఉచితంగా టాబ్స్, యూనిఫామ్, బెల్ట్ ,షూ, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధన అందించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే సాధ్యమని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా ఉండకుండా వివిధ నైపుణ్యాలు పెంపొందించడానికి చేస్తున్న సాధనను తనిఖీ చేసి, తల్లిదండ్రులకు తగు సూచనలు అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు కే.వైకుంఠరావు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆర్.రమేష్‌బాబు, ఉపాధ్యాయలు కే.శ్రీనివాసరావు, జనార్ధనరావు, శివప్రసాద్, కిషోర్, చిన్నారావు, రామన్నాయుడు, విష్ణు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ నియామకాల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ శ్రీకాకుళంలో గత డిసెంబర్ నెలలో మేథా సర్వో వారు నిర్వహించిన వ్రాత, మౌఖిక పరీక్షలో ఎంపికైన తృతీయ సంవత్సరం ఎలక్ట్రికల్ విద్యార్థులు ఎం.నాగలక్ష్మి, టి.రాజశేఖర్, ఎల్.తరుణ్, జనవరి నెలలో సోక్రటానిక్స్ టెక్నాలజీ వారు నిర్వహించిన వ్రాత, మౌఖిక పరీక్షలో ఎంపికైన తృతీయ సంవత్సరం కంప్యూటర్ విద్యార్థులు పి.భవాని, బి.ఆర్యా, కె.దుర్గా సాయిరాం, కె.తరుణ్‌సాయి, ఎస్.ఉదయ్‌కిరణ్ ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి 2.4 లక్షల నుండి 3 లక్షల రూపాయల వరకు వేతనం లభిస్తుంది. ఈ సందర్భంగా కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించి ముఖ్య అతిథి సెట్‌శ్రీ సీఈఓ ప్రసాద్ చేతులమీదుగా ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇన్‌చార్జి దామోదరరావు, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చెంచమ్మ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘవరం పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకుడు పరపటి మేనకేతనరెడ్డి సతీమణి, పరపటి చెంచమ్మ కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. వీరి నియామకానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు తనవంతుగా కృషిచేసి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఒప్పించి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి వచ్చేందుకు కృషి చేశారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు కృషి పట్ల మేఘవరం పంచాయతీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు పరపటి మేనకేతన రెడ్డి, నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరపతి చెంచమ్మ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు చెంచమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సూరాడ రాజారావు, మండల సచివాలయాల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు మోడీ భాస్కర్ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ నక్క భీమారావు, భావనపాడు పంచాయతీ సర్పంచ్ బుడ్డా మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం దృష్టికి నియోజకవర్గ అభివృద్ధి

విశాలాంధ్ర-పాతపట్నం : భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయడానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజక వర్గం లోని పలు సమస్యలను జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళటం జరిగిందన్నారు. అనంతరం పాతపట్నం నియోజక వర్గంలోని ఐదు మండలాలకు త్రాగునీరు అందజేయుటకు 265 కోట్ల రూపాయలు మంజూరు చేసినందున నియోజక వర్గం ప్రజల తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పాతపట్నం నియోజక వర్గం పరిధిలోని పలు అభివృద్ధి పనులను గూర్చి చర్చించారు.

నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్, ఇకెవైసి మరింత వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్.డి.ఓలు, తహశీల్దారులు, సర్వేయర్లతో బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే, ఇకెవైసి పనులు నత్తనడకన సాగుతున్నాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసేలా కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని,అందుకోసమే ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గుర్తు చేశారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై ఆరా తీసిన కలెక్టర్ పనుల వేగవంతంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయాలన్నారు. పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. తొలుత రణస్థలంలో రీసర్వే సక్రమంగా జరగకపోవడంపై విమర్శలు వస్తున్నాయని, అందుకు గల కారణాలను కోరగా, తహసీల్దార్ వివరించారు. పనుల్లో ఒకరోజు ఆలస్యం జరిగినా పర్వాలేదని, ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగవంతంగా చేసినప్పటికీ, మరలా కార్యక్రమం వెనుకంజలో ఉందన్నారు. ఇలాగైతే అనుకున్న లక్ష్యాలను సాధించలేమని తెలిపారు. స్టోన్ ప్లాంటేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. శతశాతం స్టోన్ ప్లాంటేషన్ పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పనుల నిర్వహణలో ఎటువంటి ఒత్తిడిలకు తలొగ్గరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 3 లక్షల 33 వేల 649 స్టోన్ ప్లాంటేషన్ పూర్తిచేయడం జరిగిందని, ఇంకా ఒక లక్ష స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందని కలెక్టర్ కు వివరించారు. పెండింగులో ఉన్న ప్లాంటేషన్ పనులను ఈ నెల 18నాటికి పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. నేటికీ స్టోన్స్ అందని గ్రామాలకు సంబంధించిన వివరాలు తెలపాలని వెంటనే స్టోన్స్ అందజేయడం జరుగుతుందన్నారు. స్టోన్స్ మిగిలిఉన్న గ్రామాల వివరాలు తెలిపి మిగిలిన స్టోన్స్ ఒక ప్రాంతంలో ఉంచాలని వాటికి కావలసిన గ్రామాలకు తరలించే చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, ఆర్.డి.ఓలు బి. శాంతి, సీతారామూర్తి, తహశీల్ధారులు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కెవైసి ప్రక్రియ పూర్తి చేసుకోవాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస సబ్ టెజరీ కార్యాలయం పరిధిలోగల పలాస, వజ్రపు కొత్తూరు, మందస, నందిగాం మండలాలకు చెందిన ప్రభుత్వ పింఛనుదారులు ఈనెల 6వ తేదీలోగా సిఎఫ్ఎంఎస్, ఐడి నెంబర్లుతో అనుసంధానం చేయించుకోని ఇకెవైసి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తమ్మినాన మాధవరావు, కార్యదర్శి నెమలిపురి అప్పారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉప ఖజానా కార్యాలయానికి వారివారి ఆధార్‌కార్డులు, ఫోన్‌నెంబరు, పిపివో కాపీ, బ్యాంక్ పాసుపుస్తకం తీసుకొని వెళ్లాలని కోరారు.

కాశీ అన్నపూర్ణ ట్రస్ట్‌కి రూ. 10 వేలు వితరణ

విశాలాంధ్ర-పాతపట్నం : ఏప్రిల్ 22 నుండి మే నెల 03వ తేది వరకు జరుగుచున్న, గంగానది పుష్కరాలు సందర్భంగా, కాశీలో నిర్వహిస్తున్న పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు అన్నదాన నిమిత్తం పాతపట్నం నకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పారశెల్లి రామరాజు, కార్యదర్శి రాజులమ్మ, కాశీ అన్నపూర్ణ అన్న క్షేత్రం ట్రస్ట్ వారణాసి వారికి రూ. 10వేలు వితరణ చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్

విశాలాంధ్ర-అరసవల్లి : ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని బుధవారం జీఎస్‌టి డిప్యూటీ కమిషనర్ శైలజ రాణి కుటుంబసమేతంగా దేవాలయం నకు విచ్చేసి శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీ స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్ అందజేశారు.

రహదారి ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర-నరసన్నపేట : మండలంలోని జమ్ము పంచాయితీ రావాడపేట గ్రామం సమీపంలో శ్రీ మండలమ్మ పేరంటాలు ఆలయ దగ్గర జరిగిన రహదారి ప్రమాదంలో ఒక వివాహిత మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జలుమూరు మండలం తిమడాం గ్రామానికి చెందిన కింజరాపు సావిత్రి(36) తన అక్క కొడుకుతో స్కూటీపై జమ్ములో జరుగుతున్న శ్రీ అసిరితల్లి పండుగలకు భోజనానికి వచ్చి, తిరిగి తన స్వగ్రామానికి వెళ్ళిపోతున్న సమయంలో స్కూటీ ఎదురుగా వున్న ఆటోను ఢీకొట్టడంతో వెనుక భాగాన వున్న సావిత్రి హఠాత్తుగా రహదారిపై పడిపోవటంతో తల వెనుక భాగం రహదారికి తగిలి, అక్కడికక్కడే మృత్యువాత పడింది. ప్రమాదవార్త తెలుసుకున్న ఎస్ఐ, వై.సింహాచలం సంఘటనా స్థలానికి వెళ్ళి, వివరాలు సేకరించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు, భర్త శిమ్మన్న వున్నారు. మృతదేహాన్ని ఎస్.ఐ, సింహాచలం పోస్టుమార్టంకు పంపించి, కేసు నమోదు చేశారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు సాధ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మండలం తండేవలస గ్రామంలో కృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులు 1000 కేజీల ఘన జీవామృతాన్ని తయారుచేశారు. ఈ ఘన జీవామృతం తయారీలో బెల్లం, పప్పుదినుసులు, పిండి, అవు పేడతోపాటు మూత్రం ఉపయోగించామన్నారు. ఈ ఘనజీవామృతాన్ని పంటలలో ఉపయోగించడం వలన నేల సారవంతంగా మారుతుందని, పంటకు అవసరమైన సూక్ష్మజీవులు అన్నీ కూడా నేలలో అభివృద్ధి చెంది పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. ఈ విధంగా రైతులు పంటలలో బయట నుండి తీసుకొచ్చే రసాయన ఎరువులను వినియోగించకుండా వాటికి బదులుగా కేవలం తమ వద్ద ఉండే ఒక్క ఆవు పేడ మాత్రంతో ప్రకృతి సేద్యంలో ఎరువులను సులువుగా తయారు చేసుకుని పంటలను పండించవచ్చునని సిబ్బంది శివశంకర్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అప్పన్న, పావనిలు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం దారుణం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం దారుణమని, ఈ నిర్ణయం వలన గిరిజనులు నష్టపోతారని అంబేద్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి ఆధ్వర్యంలో నగరంలో తలపెట్టిన 48 గంటల నిరవధిక నిరాదీక్షకు బుధవారం ఆయన సంఘీభావం తెలియజేశారు. నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి తైక్వాండో శ్రీను మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్స్ ఇండియా మిషన్ (ఏఐఎమ్) సైనిక్ విభాగం రాష్ట్ర కన్వీనర్ తైక్వాండో శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకి, దళితులకి అన్యాయం జరుగుతుందన్నారు. కేవలం ఓట్ల కోసమే వారికి నష్టం చేసేలా రాజకీయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి ఆదివాసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాబ యోగి, కంఠ వేణు, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య 64వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి, జెండా ఆవిష్కరణను ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కొన్న శ్రీనివాసరావు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు కల్పనకై అఖిల భారత యువజన సమాఖ్య రాజీ లేకుండా పోరాటం చేస్తుందని తెలిపారు. 1959వ సంవత్సరం మే నెల మూడో తేదీన ఏఐవైఎఫ్ సంఘంగా నిలబడి, భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు, చేగువేరా స్ఫూర్తితో నేటికి 64వ సంవత్సరాలోకి అడుగు పెట్టిందని అన్నారు. మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం రూపొందించి అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు, ఎన్.సాంబశివరాజు, ఏ.రాము, ఏ.విజయ్, బాలరాజు, మోహన్, భాస్కర్, అభి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో : మండలం కూర్మనాథపురం గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 64 ఆవిర్భావ దినోత్సవం నిర్వహించి అనంతరం జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి మౌలిక వసతులు కల్పనకై ఏఐవైఎఫ్ రాజీ లేకుండా ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ ఉన్నదని ఆయన తెలిపారు. 1959వ సంవత్సరం మే నెల మూడో తేదీన ఏఐవైఎఫ్ సంఘంగా నిలబడి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు, చేగువేరా స్ఫూర్తితో నేటికీ 63 సంవత్సరాలు పూర్తి చేసుకుని

64వ సంవత్సరంలోనికి అడుగుపెట్టిందని అన్నారు. మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం రూపొందించి అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ పోరాడాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎ రాము, ఎ విజయ్, ఎస్ అప్పన్న, కె రమణ, కిషోర్, ఎ. మన్మథ, ఎస్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంటౌన్‌లో : సూర్య మహల్ జంక్షన్ ఆవరణలో అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 64 ఆవిర్భావ దినోత్సవంని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యువజన సమాఖ్య జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావులు

మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి మౌలిక వసతులు కల్పనకై ఏఐవైఎఫ్ రాజీ లేకుండా ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ ఉన్నదని ఆయన తెలిపారు. 1959వ సంవత్సరం మే నెల మూడో తేదీన ఏఐవైఎఫ్ సంఘంగా నిలబడి భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురు, చేగువేరా స్ఫూర్తితో నేటికీ 63 సంవత్సరాలు పూర్తి చేసుకుని 64వ సంవత్సరంలోనికి అడుగుపెట్టిందన్నారు. మతోన్మాదానికి, కాషాయ భావజాలానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం రూపొందించి అమలు చేయాలని, విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ పోరాడాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కె. గోపాల్, సాయి, రామస్వామి, గణేష్, మహేష్, రాహుల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీభరణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఈనెల 13వ తేదీన స్థానిక జూనియర్ సివిల్‌కోర్టులో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసుకుని విజయవంతం చేయాలని స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్, మండల న్యాయ సేవా సంఘం ఇంచార్జి అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి డి. శ్రీభరణి అన్నారు. అమె బుధవారం స్థానిక జూనియర్ కోర్టులో మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల13న కోటబొమ్మాళి కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తామని ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని సివిల్ కేసులు, భార్య భర్తల కేసులు, చిట్ ఫండ్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తామని, అందువల్ల న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయాలని కోరారు. అలాగే ఈనెల 5వ తేదీన కోటబొమ్మాళి కోర్ట్ వద్ద ముందస్తు లోక్ అదాలత్ (ప్రీ-లోక్ అదాలత్)ను నిర్వహిస్తామని తద్వారా ముందుగా గుర్తించిన కేసులను పరిష్కరిస్తామని కూడా తెలిపారు. ఈనెల 8వ తేదీ నుండి ప్రతీ రోజూ ముందస్తు లోక్‌అదాలత్ (ప్రీ-లోక్ అదాలత్) ను నిర్వహిస్తామని తెలిపారు. సివిల్ కేసులలో లోక్ అదాలత్‌లో రాజీపడిన యెడల కోర్ట్ ఫీజు వాపసు ఇవ్వబడునని తెలిపారు.

అజాత శత్రువు అప్పలనాయుడు

విశాలాంధ్ర -శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : మూడున్నర దశబ్దాల ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా పేరుగాంచిన స్వర్గీయ శాసపు అప్పలనాయుడు అజాతశత్రువుగా మన్ననలు అందుకున్నారని జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురంగి మోహనరావు, జి.ఇందిరాప్రసాద్, శాసపు జోగినాయుడులు అన్నారు. బుధవారం నగరం లో గల బలగలో ఒక కల్యాణ మండపంలో స్వర్గీయ శాసపు అప్పలనాయుడు సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు హాజరైన ప్రముఖులు అంతా అప్పలనాయుడు మాస్టర్ సమాజానికి అందించే సేవలు కొనియాడారు. పిల్లలను ఉన్నతులుగా తయారుచేసి, సోదరులకు మంచి స్థితిలో పెట్టి అన్ని వర్గాల ప్రశంసలు అందుకున్నారన్నారు. ఈ సంస్మరణ సభలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే సరైన మార్గం

విశాలాంధ్ర-పలాస: కార్మికుల హక్కుల సాధనకు పోరాటాలే సరైన మార్గమని, మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడాలని న్యూడెమాక్రసీ నేతలు అన్నారు. బుధవారం నీలావతి గ్రామంలో అంతర్జాతీయ శ్రామిక పోరాట దినం 137వ మేడే మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించాలని పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి కార్మిక వర్గ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బాలక్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోడి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను, 4 లేబరు కోడ్‌లుగా మార్చిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తుందని, ప్రస్తుతం వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు కనీస హక్కులకు నోచుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా కార్యదర్శి కుసుమ, హేమావతి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్, జగన్, మాధవరావు, అప్పయ్య, పాపయ్యలు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం సరియాబొడ్డపాడు గ్రామానికి చెందిన కాశి మురళికి వెన్ను ఎముకలో కణితి ఏర్పడటం వల్ల తన రెండు కాళ్లు కనీసం కదపలేని స్థితిలో ఉన్నారని తెలుసుకొని వైద్య ఖర్చులు కోసం మండలం కొత్తపేటకు చెందిన హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ అతనికి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మురళి శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారనీ కుటుంబ సభ్యులు తెలియచేయడం జరిగింది. కొంత మంది పెద్దలు సమాచారం ఇవ్వడంతో వారి పరిస్థితులును పరిశీలించి కోటబొమ్మాళి మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌కీ వెళ్లి కాశి మురళికి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. దయచేసి పెద్ద మనస్సుతో ఆలోచించి పెద్దలు ముందుకు వచ్చి మీకు చేతనైన సహాయం కాశి మురళికి చెయ్యవలసిందిగా హెల్పింగ్ హ్యాండ్స్ కొత్తపేట సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ కొత్తపేట అధ్యక్షులు కంబాల అప్పలరాజు మరియు ముకుందరావు, రాకేష్, జీరు రామకృష్ణ, దాసరి కిట్టు, రెడ్డి సిమ్మన్న పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర-సోంపేట : మండల పరిధిలోని మాకన్నపురం నుంచి పొత్రఖండ, జగతి కేశుపురం వరకు గల రోడ్డు గోతుల మయంగా మారిందని, జెడ్పీ నిధుల నుంచి గాని, మండల పరిషత్ నిధుల నుంచి గాని నిధులు విడుదల చేసి నూతన రోడ్డు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్, సోంపేట మండల సమాచార హక్కు చట్టం ప్రధాన కార్యదర్శి మద్దు సోమశేఖర్‌యాదవ్ కోరారు. ఈ విషయమై నియోజకవర్గ ఇన్‌చార్జికి, జెడ్పీ చైర్‌పర్సన్‌కు, సోంపేట ఎంపీపీ నాతో పాటు గ్రామ రైతులు, మహిళలు అనేకమార్లు విన్నవించినప్పటికీ నేటికి స్పందన శూన్యమని అన్నారు. నూతనరోడ్డు నిర్మాణం విషయమై అధికారులు, నేతలు స్పందించి నిధులు మంజూరు చేయించి మాకన్నపురం నుంచి పొత్రఖండ, ఉప్పరిపేట, జగతికేశుపురం గ్రామాలను కలుపుతూ నూతన రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

చెరువుల్లో మట్టి తీసి, కొండలు పిండి చేసి...!

- అప్పాచెరువు గోర్ల, కప్పేశారు..!

- అక్రమార్కులకు అధికార అండ... - కాసుల కక్కుర్తిలో అధికారులు

విశాలాంధ్ర-ఆముదాలవలస : ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమార్కుల గద్దలలో వాలిపోతున్నారు. అటువంటి వారికి అధికార పార్టీలోని చోటా నాయకులు అండ పుష్కలంగా ఉంది. చెరువులను తవ్వేసి మట్టి గ్రావెల్ తెగ నమ్ముతున్న చర్యలు లేవు. చెరువులను, ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన వారు కన్నులుండి చూడలేని కబోదులుగా వ్యవహరిస్తున్నారని వాదన ఉంది. సర్వే నెంబర్ 65లో ఎనిమిది వందల ఇరవై ఎకరాలు సైలాడ కొండను సైతం పిండి చేశారు. చిన్నవాని చెరువు, ఎర్రయ్య చెరువు తదితర వాటిల్లో గ్రావెల్ తవ్వి విక్రయిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన మార్కెట్ యార్డును ఆక్రమించి బడ్డీలు నెలకొల్పారు. అలాగే పాలబంద చెరువు గట్టుపై దర్జాగా బడ్డీలు ఏర్పాటు చేశారు. దీంతో వారి ఆగడాలకు అవధులు లేకుండా పోయాయి. చెరువులు, స్మశానాలు, రహదారులు, మార్కెట్ స్థలాలు ఇలా ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ ఆస్తులు సంరక్షణ కమిటీ విడుదల చేయలేదు. దీంతో సర్వే మార్పు లేదన్న నెపంతో అవినీతికి మార్గం సుగమం చేసుకుంటున్నారనె విమర్శలున్నాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆముదాలవలస పర్యటనలో అనుమతి లేని వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ దిగువ స్థాయి అధికారులు స్పందన కరువైంది. దీనికి అధికార పార్టీ నాయకుల మౌఖిక ఆదేశాలు కారణమని తెలుస్తుంది. పురపాలక సంఘ పరిధిలోని 23వ వార్డు లక్ష్ముడు పేట గ్రామంలో అధికార పార్టీ నాయకులు అండతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తూ రెచ్చిపోతున్నారు అనే విమర్శలు ఉన్నాయి. ప్రశ్నించే వారిపై దబాయిస్తూ అందులకు గురి చేస్తున్నారు. ఈ విషయం అధికారులు దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వారు మిన్నకుండి పోతున్నారు. ఇదే అనగా వారి వద్ద నుంచి అందిన కాడకు సొమ్ములు నొక్కేసి అధికార పార్టీ నాయకులకు దాసోహమై పోయారన్న విమర్శలున్నాయి. ఉన్నాయి. 2011లో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, సెప్టెంబర్ 14, 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఇచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 188, పి ఆర్ ఆర్ డి 2011 ను అధికారులు బుట్ట దాసులు చేశారని చెప్పాలి. దీనికి సంబంధించి ఆస్తుల పరిరక్షణకు కనీసం గజిట్ కూడా విడుదల చేయలేదు. కోట్ల రూపాయల విలువ చేసే భూములు పరాన్న బుక్కుల పాలౌ తున్నాయి. ఇటువంటి వాటికి అధికార పార్టీ అండ ఉంటే మరింత సులువుగా ఆక్రమించుకొని అధికారులకు లంచాలతో కళ్ళు కప్పుతున్నట్టు తెలిసింది. విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి పనులు చేస్తూ, కోర్టు ధిక్కరణకు పాల్పడే అధికారులు చట్టానికి, భారత రాజ్యాంగానికి అతీతులు కాదు అనే అంశం అధికారులకు తెలియక కాదు. సామాన్యుడు ఈ అంశం ప్రశ్నించే స్థాయికి వస్తే అంధకారంలో ఉన్న అధికార ముసుగు తొలిగిపోతుంది. పంచాయతీ ఆస్తులు అనగా ప్రజల సామూహిక ఆస్తులు అయిన రోడ్లు, పార్కులు, స్మశానం, మేత బీడు, మంద బయలు, కల్లం, కాలువలు, వాగు, వంక, కుంటలు, చెరువులు, సరస్సులు , నదులు మొదలగు భూముల పరిరక్షణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రతి పంచాయతీ నందు ఆస్తులకు గెజిట్ విడుదల చేయాలి. సదరు భూములు ఆక్రమణ గురికాకుండా చూడాల్సిన కమిటీలో కలెక్టర్ చైర్మన్ గా ఉన్నారు.

జిల్లా పోలీసు అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్, సభ్యులు గా వుంటారు. అయినప్పటికీ అధికారులు అహంకారంతోనో, జవాబుదారీ తనం లేకుండా సదరు సుప్రీంకోర్టు ఉత్తరువును బుట్ట దాఖలా చేశారు. సామాన్యులు, పేదవారు రెక్కలు ముక్కలు చేసుకొని చెల్లించే పన్నులు ద్వారా జీత, భత్యాలు పొందే ప్రభుత్వ ఉద్యోగులు/ పబ్లిక్ సర్వెంట్స్ వారి ప్రధాన విధుల్లో ఉదాసీనంగా వ్యవహరించడం ప్రజా స్వామ్య వ్యవస్థలో ఆందోళన కలిగించే అంశంగా పరిగణించ బడుతుంది. కోర్టు ఉత్తరువు తరువాత కూడా నిత్యం పత్రికల్లో కోట్ల రూపాయలు విలువైన సామూహిక భూముల ఆక్రమణ వార్తలు దర్శనం ఇస్తూ వున్నాయి. ఉన్నత స్థాయి వ్యక్తుల మౌనం వినాశనానికి దారి తీస్తుంది. వీటిపై స్వీయ విచారణకు ఆదేశించే బాధ్యత తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ అంశాలపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సామాన్య ప్రజలలో ఇటువంటి అంశాలు పెల్లుబికి నాడు కోర్టులు స్పందించక తప్పదు. ఆముదాలవలస పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను గుర్తించి, ఆస్తులు సంరక్షణ కమిటీ 2022లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లా పెద్దలను కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఉంచుతూ స్థానిక అధికారులను కమిటీలో నియమించారు. అయినప్పటికీ ఆ కమిటీ నేటికీ ఒక్కటి కూడా నిర్ధారణ చేయలేదు. అంటే అధికార పార్టీ మౌఖిక ఆదేశాలే గజిట్ నోట్ గా పరిగణిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ చట్టాలను ఉల్లంఘించి మట్టి, కంకర, అక్రమంగా తెగ నమ్మి నవారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉంది.

అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణంకు భూమి పూజ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియం నిర్మాణం కు స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు బుధవారం భూమిపూజ చేశారు. మండల అంబేద్కర్ సేవాసమితి అధ్యక్షుడు బోకర జడ్డెన్న, ప్రధాన కార్యదర్శి దువ్వారపు సింహాచలం ఆధ్వర్యంలో ఈ ఆడిటోరియం నిర్మాణం జరుగుతుందని, దాతలు, అంబేద్కర్ అభిమానులు ముందుకువచ్చి ఆర్థిక సహాయం అందజేయాలని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు దేవాది కృష్ణరావు, కూన మల్లయ్య, సురేష్, సిమ్మన్న, కాల ఆదినారాయణ, సామ సంజీవరావు, కర్జాన భాస్కరరావు, దేవాది రామారావు, ఏ మహేష్, యస్వంత్ తదితరులు ఈభూమిపూజలో పాల్గొన్నారు.

కాశీబుగ్గలో బైబిల్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-పలాస : ది బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖ సహకారంతో పలాస కమిటీ ఆధ్వర్యంలో కాశీబుగ్గ పల్లివీధిలో గల జెఎస్ఎంబి చర్చి ఆవరణలో ఈ నెల 5,6 తేదీల్లో బైబిల్ ఎగ్జిబిషన్ కమ్ సెల్స్ నిర్వ హిస్తున్నట్లు పలాస బ్రాంచ్ అధ్యక్షులు రెవరెండ్ సుందర్‌సింగ్, ఉపాధ్యక్షులు జి.ఎం.ఎస్. అనిల్ రాజు తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అన్ని భాషల్లోను బైబిల్ ఒకే చోట దొరికే అరుదైన అవకాశాన్ని అందరు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఎగ్జిబిషన్‌కు పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌విక్రమ్‌లు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. వారితో పాటు కార్యదర్శి జాన్సన్, కోశాధికారి దేవప్రసాద్‌లు ఉన్నారు. అనంతరం గోడ పత్రికను విడుదల చేశారు.

వైసీపీలో వెలమలకు అధిక ప్రాధాన్యత : మండల విప్ అప్పన్న

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో, ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ వెలమ కులస్థులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఈ విషయం పార్టీకోసం కష్టపడిన, పదవులు పొందిన వెలమకులస్థులకు తెలుసునని మండల విఫ్ బొడ్డు అప్పన్న అన్నారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ వెలమకులస్థులకు వైకాపా ప్రభుత్వం, దువ్వాడ శ్రీనివాస్ ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఇటీవల ఊడికలపాడు గ్రామంలో ఓ సమావేశం పెట్టారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజంలేదని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీకి చెందిన కొంతమంది వెలమ కులస్థులు లబ్ధిపొందేందుకు మా పార్టీలో చేరి లబ్ధిపొంది, తిరిగి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్ళీ టీడీపీలోకి వెళ్ళేందుకు మా పార్టీపైన, మా నాయకుడు దువ్వాడ శ్రీనువాస్‌పైన బురదజల్లే కార్యక్రమం చేపడుతున్నారని, అలాంటి వారి చరిత్ర మొత్తం నావద్ద ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఊడికలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు పేరుచెప్పుకొని అడ్డగోలుగా బాగా డబ్బును సంపాదించి, డబ్బు ఉందన్న అహంకారంతో నమ్మి చేరదీసిన స్థానిక టీడీపీ నాయకులకు దెబ్బకొట్టి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు మళ్ళీ వైకాపా నాయకులతో తిరుగుతున్నాడని, ఇలాంటి వారు వారి ప్రయోజ నం కోసం అవసరం బట్టి పార్టీలు మారుతుంటా రని అలాంటివాడిని నమ్మి మోసపోవ ద్దని హితవు పలికారు. నిజమైన వైఎస్సార్‌సీపీ వెలమ కార్యకర్తలు దువ్వాడ గెలుపుకోసం చాలా కష్టపడుతున్నారని, అన్ని కులస్థులంతా ఒకే దాటిపై ఉన్నామని వస్తున్న ఎన్నికల్లో దువ్వాడ శ్రీనివాస్ 50వేల ఓట్లు మెజారీటితో గెలిపిస్తామని ఆయన జోష్యం చెప్పారు.

భాషలన్నిటికీ మూలం సంస్కృత భాష

సర్పంచ్, ఎంపీటీసీ వీరస్వామి, రాజులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : భారతదేశంలో ఉన్న భాషలన్నింటికీ మూలం సంస్కృత భాష అని లక్కివలస సర్పంచ్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు శ్రీరంగం వీరస్వామి, లక్కివలస ఎంపీటీసీ చింతల రాజులు అన్నారు. సంతబొమ్మాళి మండలం లక్కీవలస పంచాయతీలో ఉన్న గెద్దలపాడు ప్రాథమికోన్నత (ఎంపీయూపీ) పాఠశాలలో సంస్కృత భారతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సరళ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన, ఉత్తీర్ణులైన విద్యార్థులకు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను వారు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సంస్కృత భాష తత్సమ భాష అని, సంస్కృతంలో అక్షరాలు గాని పదాలు కానీ మార్పు లు, చేర్పులు చెందవని, ఇతర భాషలలో అక్షరాలు పదాలు మార్పు చెందుతూ ఉంటాయని అన్నారు. సంస్కృతం భాష ప్రతి విద్యార్థి నేర్చుకోవాలని, దీనివలన వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, ఇతిహాసాలు, పురాణాలు అవలీలగా అర్థమయ్యే స్థితిలో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో సంస్కృత భాషా ప్రాధాన్యత అధికంగా ఉంటుందని, విద్యార్థి స్థాయి నుంచే సంస్కృత భాషను రాయడం, చదవడం అలవాటు చేసుకోవాలని వారు కోరారు. సాంస్కృతము భాష ప్రచారం చేస్తున్న సాంస్కృత భారతి సంస్థ కు, సంస్థ ప్రతినిధులు కు ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లక్కివలస మాజీ సర్పంచ్ శ్రీరంగం రాజులు, విద్యాకమిటీ చైర్మన్ మంకు గారయ్య, హిందీ ఉపాధ్యాయులు దూపాన తవిటి రాజు, శమళ్ల అప్పారావు, నీలాపు అప్పలరాజు తో పాటు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యా కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో సతిమణి మృతి

విశాలాంధ్ర-పొందూరు: స్థానిక ఎంపీడీవో, బూర్జ మండలం ఈవోపీఆర్డీ, టెక్కలి డివిజన్ దీఎల్పివో సీపాన హరిహరరావు సతీమణి సీపాన పద్మావతి అనారోగ్యంతో మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్లో మృతి చెందారు. ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో హైదరాబాద్లోని ప్రవేటు ఆసుపత్రిలో చికిత్సను అందిస్తుండగా పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. స్వగ్రామం. తోబాపిలో అంత్యక్రియలను నిర్వహించారు. ఈమె మృతికి ఎంపీపీ డిల్లి ఉషారాణి, జడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైస్ ఎంపీపీలు వందన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ, వైసిపి మండల అధ్యక్షుడు పప్పుల రమేష్ కుమార్, వీఏసీఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మెన్ బాడాన సునీల్ కుమార్, తహసీల్దార్ రాంబాబు, ఏపీఎం శ్యామలరావు, ఏపీవో శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కూన ప్రమీల, బాడాన హారిక. కిల్లాన సూర్యారావు, తోలాప్ సర్పంచ్ ప్రతినిధి పప్పుల రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ పప్పుల అప్పలనాయుడు, తదితరులు తమ ప్రగాడ సంతాపాన్ని తెలిపారు.

వేడుకగా ఉత్సవమూర్తుల తిరువీధి

విశాలాంధ్ర-జలుమూరు: మండలంలోని గొటివాడ కొత్తగా నిర్మించిన వీరవెంకట నారాయణ స్వామి ఆలయం ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంపై ఉంచి మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ తిరువీధి నిర్వహించారు. మహిళలు ముగ్రాటలతో స్వామి వారిని దర్శించుకున్నారు. అమ్మ చల్లంగా చూడమ్మా అంటూ మొక్కులు తీర్చుకున్నారు. వారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల నుంచి భక్తులు వచ్చారు.

మే 6లోగా పెన్షనర్లు ఈ కెవైసీ చేయించాలి

విశాలాంధ్ర-ఆమదాలవలస: పెన్షనర్లు అందరూ మే ఆరో తేదీలోగా పెన్షన్ కు ఇబ్బంది లేకుండా ఈ కేవైసీ చేయించు కోవాలని జిల్లా ట్రెజరీ ఉపసంచాలకులు సిహెచ్ రవికుమార్ తెలిపారని మామగారి పెన్షనర్ సంఘం ప్రతినిధులు వివరించారు. ఆముదాలవలస సబ్ ట్రెజరీ పరిధిలో 1130 మంది పెన్షనర్లు ఉండగా కేవలం 440 మంది మాత్రమే ఈ కేవైసీ చేసుకున్నట్లు సబ్ ట్రెజరీ అధికారి సువర్ణ రాజు తెలిపారని వివరించారు. ఆల్ పెన్షనర్స్ మరియు రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దన్ రావు ఒక ప్రకటనలో వివరించారు. ఇందుకు సంబంధించి ఆధార్ కార్డు, పిపిఓ హాజరు కాపీ, సిఎఫ్ఎంఎస్ నంబరు, మొబైల్ ఫోన్ తీసుకొని ఎస్‌టీఓ కార్యా లయానికిగాని, అందుబాటులో ఉన్న నెట్ సెంటర్‌కి కానీ, లేదా హెర్బ్ ఈ యాప్ ద్వారా మీ మొబైల్ నుంచి గాని ఈ కేవైసీ చేసుకోవచ్చని వివరించారు. సమయము తక్కువగా ఉన్నందున మరికొంత గడువును పెంచాలని ప్రభుత్వాన్ని సంఘం ప్రతినిధులు కోరారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాల్లో ఓ ప్రక్క ఇంకా అమ్మవారి తిరువీధులు సాగుతుండగానే మంగళవారం నాడు ఊర్రూతలూగించే నవ్య జయతి సంగీత విభావరి, శ్యామ్ మ్యాజిక్ షో, శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగిణి కళాకారుల జానపద కళా ప్రదర్శనలు చూపరులను అలరించాయి. ఆలయ కమిటీ, సాంస్కృతిక కమిటీల సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారి ఆలయానికి ఎదురుగా గల విశాలమైన స్థలాన్ని చదును చేసి భారీ స్టేజీని అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, సౌండ్ సిస్టంతో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నృత్య తరంగిణి అధ్యక్షులు గోవింద్ పర్యవేక్షణలో రాత్రి ఒంటి గంట వరకూ చిన్నారులు వివిధ సాంప్రదాయ నృత్య రీతుల్లో ప్రదర్శనలతో ప్రశంశలు పొందారు. నాట్య గురువు మంగి దివ్య బృంధం చేసిన శివ తాండవ నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. కళాకారులను సాంస్కృతిక కమిటీ ఘనంగా సన్మానించింది.

నిర్లక్ష్యంతో కూలిన వంతెన

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఉత్తర దక్షిణ భారతదేశాల రాకపోకలకు వారధిగా నిలిచి దశాబ్దాల పాటు సేవలు అందించి అలసిన వంతెనకు తగిన రక్షణ చర్యలు లేకపోవడంతో చాలా ఏళ్ళుగా ధీనస్థితికి చేరుకుంది. దాదాపుగా అందరు అధికారులకు, ఆ వంతెన మీదుగా రాకపోకలు సాగించే అన్ని వాహనదారులకు అది తెలిసిన విషయమే. పదుల సార్లు పత్రికలు ఘోషించినా... అమ్యామ్యాలకు అలవాటు పడో అధికార పక్షాల ఒత్తిళ్ళకు తలొగ్గో ఆ వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలు మాత్రం నిలువరింపబడలేదు అనడానికి బుధవారం నాటి దుర్ఘటన ఓ సజీవ సాక్ష్యం. బుధవారం వేకవఝామున 5 గంటల ప్రాంతంలో బాహుదా నది పై రోడ్డు వంతెన కూలిపోయింది. ఆ వంతెనకు ఈ ప్రాంతానికి దశాబ్దాల నాటి బంధం ఓ అక్రమ రవాణాతో పుటుక్కున తెగిపోయింది. నేను మోయలేకున్నా... అని ఆ వంతెన మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేక వేదన అనుభవిస్తూనే ఇన్నాళ్ళుగా ప్రజలను, పశువులను, వస్తువులను బాహుదా తీరాలు దాటించింది. ఏ రోజు బాహుదా వంతెన కుప్పకూలిన ఆ బాధ్యత పాలక పక్షాలు, అధికారులదే అనేది నగ్న సత్యం. కాలం చెల్లి పట్టుతప్పిపోతున్నా తువ్వు పట్టిన ఒంటితో పంటి బిగువున బాధను భరిస్తూ బాహుదా వంతెన టన్నుల భారాలు మోసి మోసి ఒక్క సారిగా కూలి ఈ ప్రాంత వాసులకు వేదన కల్గించింది.

ఒడిశాలో అస్కా నుండి ఆంధ్రాలోని ఒంగోలుకు 22 చక్రాల ట్రైలర్ ఏ.పి. 27 యు.బి 2304లో 70టన్నుల గ్రానైట్ రాయిని తరలిస్తున్నారు. సంబరాల నేపథ్యంలో పురుషోత్తపురం వద్ద పోలీస్ అవుట్‌పోస్టు ఉన్నా సదరు వాహనం బరువు పరిమితికి మించిన లోడుతో ఆంధ్రాలోకి ప్రవేశించేసింది. పట్టణం గుండా నది బ్రిడ్జి పైకి వాహనం ముందు భాగం చేరుకున్నాక లోడు ఉండే భాగం బ్రిడ్జి ఎక్కగానే పట్టుతప్పి వంతెన కూలిపోయింది. భారీ లోడు కారణంగా వంతెన కూలిపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం ప్రారంభించారు. అసలు సదరు వాహనం ఎవరి నిర్లక్ష్యంతో పట్టణం దాటింది? దాన్ని పర్యవేక్షించే వ్యక్తుల ప్రభావం ఏ మేరకు అధికారులపై ఉండిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీషర్ల హయాంలో సుమారు 5.11లక్షల వ్యయంతో నిర్మితమై 1929 ఫిబ్రవరి 5 మద్రాసు రాష్ట్ర గవర్నర్ సి.జె గోషెన్ చేతుల మీదుగా ప్రారంభించబడి జాతికి అంకితమై సేవలు అందిస్తుంది. అప్పటి ఇంజనీరింగ్ అధికారుల అంచనా ప్రకారం వంతెన వయస్సు 50 ఏళ్ళు కాగా 1980తో కాలం చెల్లినట్లే. అయినా అప్పటి నుండి మరమ్మత్తులతో నడుస్తూ ప్రధానమైన రవాణా రంగ కేంద్రానికి విస్తృతమైన సేవలు అందించిన వంతెనగా బాహుదా నది పై వంతెన కీర్తి గడించిది. బాహుదా నది పై రోడ్డు వంతెనతో పాటు రైల్వే వంతెనా

ఉన్నా....అది నిరంతరం అధికారుల పర్యవేక్షణ మరమ్మత్తుల వల్ల సాఫీగానే ఉందంటే రోడ్డు వంతెన పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ఎన్నోసార్లు పత్రికలు, స్వచ్ఛంద సంస్థలు గావుకేకలు పెట్టినా పట్టించుకునే వాడే లోకపోగా రోడ్డు మరమ్మత్తుల పేరుతో వంతెన పై రోడ్డు పూతలు వేసేయడం కూడా ఓ తప్పిదమే. గతంలో స్థానిక వినియోగదారుల సంక్షేమ సంఘం వంతెన రక్షణ చర్యలు కోరుతు రోడ్లు, భవనాలు, జాతీయ రహదారుల శాఖల ఉన్నత స్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో వంతెన పరిరక్షణకు భారీ వాహనాలు వంతెన మీదుగా రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసి ఆ తర్వాత విస్మరించారు. సంబంధిత అధికారులు రవాణాదారుల వత్తిళ్ళకు తలొగ్గడంతో వంతెన పై యధేచ్ఛగా భారీ వాహనాలు సాగడం కొనసాగింది. దాంతో అందరూ ఊహించినట్లే వంతెన కూలడంతో బంధాలు తెగిపోయాయి. ఓ ప్రక్క పదేళ్ళ తర్వాత పట్టణంలో

భారీ ఎత్తున గ్రామదేవత శ్రీ స్వేచ్ఛావతి సంబరాలు జరుగుతున్న వేళ ఇదో సందడి నెలకొందని స్థానికులు వాపోయారు.

వంతెన కూలిన విషయం తెలుసుకున్న ఆర్డీఓ సీతారామ్మూర్తి హుటాహుటిన సంఘటనా స్థలాన్ని తహశిల్దార్ ఎస్.గురుప్రసాద్, ఆర్. అండ్ బి అధికారులతో కలిసి సందర్శించి క్షేత స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తన అనుచరులతో కూలిన వంతెనను పరిశీలించి ప్రాణ నష్టం కల్గనందుకు భగవంతునికి కృతజ్ఞతలు తెలిపుతున్నానని, రాకపోకలు తక్షణం పునరుద్ధరించే చర్యలతో పాటు కొత్త వంతెన నిర్మాణంతో శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. జెడ్పీ ఛెయిర్‌పర్సన్ పిరియా విజయ, వై.సి.పి నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్ తదితరులు వంతెన కూలిన ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో చర్చించి, డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే 40లక్షల రూపాయలు మంజూరు జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. సీడ్ ఏ.పి చైర్మన్ సాడి శ్యామప్రసాద్ ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులను సంప్రదిస్తూ పరిస్థితిని పర్యవేక్షించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పార్టీ కార్యకర్తలతో సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ ఇసుక రవాణా, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని, ఇప్పటికైని

పరిస్థితులు చక్కదిద్దాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. రూరల్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వంతెన వద్ద ట్రాఫిక్ నియంత్రించి, జాతీయ రహదారి గుండా పట్టణంలోకి వాహనాల రాకపోకలను బెల్లుపడా మీదుగా మళ్ళించారు.